# కేనోపనిషత్తు

[సామవేదం నుండి]

వ్యాఖ్యాత

'అభినవ వ్యాస' 'జ్ఞాన ప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు

వ్యవస్థాపకులు

ఆధ్యాత్మిక జ్ఞాన పీఠం, చిలకలూరిపేట.

# పూజ్య గురుదేవులు



జ్ఞానప్రపూర్ణ

**శ్రీ దేవిశెట్టి చలపతిరావు గారు B.Sc., (Ag)**

వ్యవస్థాపకులు : ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట

Contact : (Mobile) 80085 39770 / (Land Line) 08647 254716

Email : care@srichalapathirao.com

Visit www.srichalapathirao.com to listen Pravachanas

# గురుదేవుల పరిచయము

శ్రీ దేవిశెట్టి చలపతిరావు గారు 1946 సెప్టెంబర్ 12 వ తేదీన గుంటూరు జిల్లా తుర్లపాడు గ్రామంలో జన్మించారు. తండ్రి వీరరాఘవయ్య, తల్లి పుల్లమ్మ. వీరి నివాసం చిలకలూరిపేట. ప్రాధమిక విద్య తుర్లపాడు గ్రామంలోను, ఉన్నత విద్య చిలకలూరిపేట లోను అభ్యసించి, బాపట్ల వ్యవసాయ కళాశాల నుండి B.Sc. (Ag.) ప్రధమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.

పూవు పుట్టగానే పరిమళిస్తుందనే నానుడి ప్రకారం 4 సంవత్సరాల వయస్సు నుండి 8 సంవత్సరాల వయస్సు వరకు వీరి నోటి నుండి ఏ వాక్కు వస్తే అలాగే జరిగేది. పూర్వ జన్మ సంస్కారం వల్ల వీరు 12 సంవత్సరాల వయస్సు నుండే రామాయణ, భారత, భాగవత గ్రంధాలను, పురాణాలు – ప్రబంధాలను అధ్యయనం చేయటం ప్రారంభించారు. ప్రత్యేకంగా మహాభారతంపై విశేషమైన ఆసక్తి కలిగి, 20 సంవత్సరాలకు పైగా ఆంధ్ర మహాభారతం, సంస్కృత మహాభారత గ్రంధాలపై తీవ్ర పరిశోధనలు గావించి, చిలకలూరిపేటలో 1988 నుండి 1992 వరకు ధారావాహిక ప్రవచనములు చేసి, శ్రోతల ప్రశ్నలకు అప్పటికప్పుడే జవాబులిస్తూ వారికి సందేహనివృత్తి గావించారు.

1990 నుండి చిలకలూరిపేట చిన్మయ మిషన్ కార్యదర్శిగా అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను, హోమాలను, పూజలను, గీతాజ్ఞాన యజ్ఞాలను, సత్సంగాన్ని నిర్వహించారు. 1994 లో *ఆధ్యాత్మిక జ్ఞాన పీఠాన్ని* స్థాపించి, ప్రసన్న బండ్లమాంబ శ్రీ రాజమాతాదేవి వారిచే ప్రారంభింపజేశారు. అప్పటి నుండి ప్రతిరోజూ సత్సంగము, ప్రతి నెల గీతాపారాయణలతో బాటు శ్రీకృష్ణ జన్మాష్టమి, గీతాజయంతి, శంకరాచార్య జయంతి, రమణమహర్షి జయంతి, ఆషాఢ – కార్తీక – మాఘ – వైశాఖ పౌర్ణమిల యందు ఆధ్యాత్మిక సదస్సులు, జన్మదినోత్సవం, విజ్ఞానయాత్రలు, వనసమారాధనలు, ధ్యానతరగతులు, వార్షికోత్సవం మొదలగు అనేక

కార్యక్రమాలను జరుపుకొనుటలోను, నిరంతర జప, ధ్యాన, ఆత్మవిచారణ, సాక్షీభావన, బ్రహ్మనిష్ఠ మొ||న సాధనలతో, పూర్తి ఆధ్యాత్మిక జీవితాలను గడుపుటలోను, మాకు సదా మార్గదర్శకులుగా ఉండి మా వెన్ను తట్టి, చేయిపట్టి ముందుకు నడిపిస్తున్న కర్మయోగులు, జ్ఞాన ప్రపూర్ణులు మా గురుదేవులు.

భగవంతుడు నిర్దేశించిన బాటలో పయనిస్తూ, తనలో నిక్షిప్తమైయున్న ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పదిమందికీ పంచాలనే సంకల్పంతో 1996 నుండి వివిధ పట్టణాలలో ఆధ్యాత్మిక జ్ఞాన యజ్ఞముల ద్వారా భగవద్గీత, ప్రకరణ గ్రంధాలైన శంకరాచార్యుల వారి భజగోవిందం, తత్వబోధ, ఆత్మబోధ, వివేకచూడామణి, అద్వైతసారం, దక్షిణామూర్తి స్తోత్రం, అపరోక్షానుభూతి, శ్రీ సదాశివ బ్రహ్మేంద్ర స్వాముల వారి ఆత్మవిద్యావిలాసం, శంభు నటనం, భగవాన్ శ్రీ రమణ మహర్షుల వారి ఉపదేశసారం, నారద భక్తిసూత్రములు, బ్రహ్మ సూత్రములు, ఇంకా రామాయణ, భారత, భాగవతములు, అలాగే ఈశ, కేన, కఠ, ముండక, కైవల్య, తైత్తి రీయ, సూర్య, మొదలగు ఉపనిషత్తుల పైనను ప్రవచనములు చేస్తూ జ్ఞాన సుగంధాలను నలువైపుల ప్రసరింపజేస్తున్నారు. ఇప్పటి వరకు చిలకలూరిపేట, విజయవాడ ధర్మల్ పవర్ స్టేషన్, రాయలసీమ ధర్మల్ పవర్ ప్రాజెక్ట్, వినుకొండ, శ్రీశైలం, కాశీ, తిరువణ్ణామలై, నెల్లూరు, బాపట్ల మొదలగు చోట్ల 145 ఆధ్యాత్మిక జ్ఞాన యజ్ఞములను చేశారు. 1998 లో వి.టి.పి.యస్.ఎ. కాలనీ యందు 108 హోమకుండాలతో వాసుదేవ మహాయజ్ఞాన్ని నిర్వహించారు.

1993 లో భగవద్గీత ముగింపు సందర్భంగాను, 2001 లో వివేక చూడామణి ముగింపు సందర్భంగా చిలకలూరిపేటలోను; 1999 లో భగవద్గీత ముగింపు సందర్భంగాను, 2002 లో వివేక చూడామణి ముగింపు సందర్భంగా వి.టి.పి.యస్.లోను శిష్యులందరూ గురుదేవులను ఘనంగా సన్మానించారు. 2006 లో 100 జ్ఞాన యజ్ఞాలు పూర్తిగావించిన సందర్భంగా

శిష్యులందరూ కలసి 'జ్ఞానప్రపూర్ణ' బిరుదుతోను, 2011 లో మహాభారత పరిశోధనలో గురుదేవుల కృషికి 'అభినవ వ్యాస' బిరుదుతోను గురుదేవులను సత్కరించటం జరిగింది.

1994 లో సామాన్యులకు కూడా వేదాంత విషయాలు సులభంగా అర్థమయ్యే రీతిలో గురుదేవులు 'కర్మసిద్ధాంతం' అనే చిన్న గ్రంధాన్ని రచించి ప్రచురింపజేశారు. తిరిగి 2002 లోను, 2008 లోను, 2009 లోను పునర్ముద్రణ జరిగింది. 1998 లో శుక్ల యజుర్వేదమునందలి 'ఈశావాస్యోపనిషత్తు' పై అందరికి అర్థమయ్యే విధంగా సరళమైన, వాడుకభాషలో విపులమైన వ్యాఖ్యను వ్రాసి ప్రచురింపజేశారు. 1999 లో శంకరాచార్యుల వారి 'భజగోవిందం' పై అందరికీ అతి సులభంగా అర్ధమయ్యే విధంగా, ఎంతో వివరంగా, వ్యాఖ్యను వ్రాసి ప్రచురింపజేశారు. తిరిగి 2009 లో ద్వితీయ ముద్రణ జరిగింది.

'భగవద్గీత' అనగానే "అమ్మో! అది మనలాంటి సామాన్యులకు కాదు" అనుకొనేవారు "భగవద్గీతను ఇంత తేలికగా అర్ధం చేసుకోగలమా?" అనుకొనేటట్లు ప్రవచనములు చేస్తున్న గురుదేవులు 2011 లో 1,2 అధ్యాయములను ప్రచురింపచేశారు. ఇప్పుడు 2012 లో భగవాన్ రమణ మహర్షుల "ఉపదేశసారము"నకు, సామవేదం నుండి గ్రహించబడిన కేనోపనిషత్తుకు విపులమైన వ్యాఖ్యను వ్రాసి ప్రచురింప చేశారు. ఇవిగాక ప్రస్తుతం నారదభక్తి సూత్రాలపై, శంకరాచార్యుల వారి ఆత్మబోధ, దక్షిణామూర్తి స్తోత్రంపై ఎంతో వివరణాత్మకంగా, సోదాహరణంగా, విపులమైన వ్యాఖ్యను వ్రాసి ప్రచురింప జేస్తున్నారు.

ఇవి గాక విజయవాడ నుండి వెలువడే *ధ్యానమాలిక* మాసపత్రికలో 2008 నుండి భగవద్గీతను, 2009 నుండి మహాభారతమును ధారావాహికంగా ప్రచురిస్తున్నారు. ఇక దేశవిదేశాలలో నున్న తెలుగువారు ఈ జ్ఞానాన్ని గ్రహించటానికి వీలుగా www.srichalapathirao.com పేరుతో ఒక వెబ్ సైట్ ను ప్రారంభించటం జరిగింది. దీని ద్వారా ఆధ్యాత్మిక జ్ఞానపీఠం కార్యక్రమాలను, గురుదేవుల ప్రవచనాలను, గురుదేవుల వివిధ రచనలను, భజనలు, కీర్తనలను వినవచ్చును, చదువవచ్చును, డౌన్లోడ్

చేసుకొనవచ్చును. ఇక వివిధ గ్రంధాలపై గురుదేవుల ప్రవచనములను సి.డి.ల రూపంలోను, వీడియో DVD ల ద్వారా అందిస్తున్నారు.

ముందు ముందు మోక్షమార్గంలో పయనించే ఎందరికో మార్గ నిర్దేశనం చేయగల ఎన్నో గ్రంధాలు ముముక్షు జనావళిని తరింపజేయుటకు అందుబాటులోనికి రావాలని, అందుకు త్యాగధనులైన భక్తులు, సాధకులు, మోక్షార్ధులు ముందుకు రాగలరని భగవంతుని మనసారా ప్రార్ధిస్తున్నాను.

జ్ఞాన సూర్యునిలా ప్రకాశిస్తూ, నిస్వార్ధంగా తన సేవలను అందిస్తున్న కర్మయోగి, సనాతనమైన వైదిక ధర్మాన్ని ప్రచారం చేస్తూ, మాకు మార్గదర్శకులైన భగవంతుని ముద్దుబిడ్డ మా గురుదేవులను పరిచయం చేసే భాగ్యం నాకు కలిగించినందులకు భగవంతునికి శతసహస్ర వందనములు సమర్పించుకుంటున్నాను.

– శ్రీమతి రావూరి అన్నపూర్ణ

కార్య నిర్వాహక అధ్యక్షులు
ఆధ్యాత్మిక జ్ఞాన పీఠం
చిలకలూరిపేట

# కేనోపనిషత్తు

## తొలిపలుకు

ఈలోకంలో ప్రతి ప్రాణి - ప్రతి జీవి యొక్క యదార్థ స్వరూపం పరమాత్మయే. అయితే తాను పరమాత్మస్వరూపాన్ని అని మరచి జీవుడుగా వ్యవహరిస్తున్నాడు మానవుడు. అట్టి మానవుడు తిరిగి మాధవుడుగా, నరుడు నారాయణుడుగా, జీవుడు దేవుడుగా తన స్వస్థితిలో నిలిచి పోవాలంటే అందుకు మార్గం చూపేవే వేదాలు.

వేద అంటే తెలుసుకొనుట అని అర్థం. ఏమి తెలుసుకోవాలి ? దేనిని తెలుసుకున్న తరువాత ఇక తెలుసుకోవలసినది ఏమీ ఉండదో; దేనిని తెలుసుకుంటే సర్వమూ తెలిసినట్లో అట్టి  జ్ఞానాన్ని-ఆత్మ జ్ఞానాన్ని-నేను ఆత్మను అనే జ్ఞానాన్ని తెలుసుకోవాలి. కనుక మానవుడు తరించాలంటే, తన జన్మను సార్థకం చేసుకోవాలంటే, జీవిత పరమార్థమైన మోక్షాన్ని పొందాలంటే తప్పక తెలుసుకోవలసినది వేదవిజ్ఞానాన్నే.

దీనిని సృష్టికర్త బ్రహ్మదేవుడు మొదట దివ్యవాణిగా విన్నాడు. అందుకే దీనిని శ్రుతి అన్నారు. శ్రుతి అంటే విన్నది అని అర్థం. బ్రహ్మదేవుడు మొదటగా విని ఇతరులకు బోధించటం వల్ల దీనిని బ్రహ్మవిద్య అన్నారు.

మొదట  వేద మంత్రాలన్నీ కుప్పలు తెప్పలుగా ఒక్కటిగానే ఉండేవి. కలియుగంలోని మానవులు అల్పాయుష్కులు, అల్పజ్ఞానులుగ ఉంటారు గనుక; ఈ వేదమంత్రాలను చదవటానికి గాని, అధ్యయనం చేయటానికి గాని, అర్థం చేసుకోవటానికి గాని, ఆచరించటానికి గాని తగిన తెలివితేటలు, సమయము వారికి ఉండవు గనుక; కలియుగానికి ముందే ద్వాపరయుగంలో జన్మించిన వ్యాసమహర్షి ఒక్కటిగా ఉన్న ఈ వేదమంత్రాలను నాలుగుగా విభజించి వేదవ్యాసుడయ్యాడు.

అవే ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వణ వేదము.

ఇలా విభజించబడిన ప్రతివేదము తిరిగి ఒక్కొక్కటి నాలుగు భాగాలుగా విభాగించబడినవి. అవే 1. సంహిత (మంత్ర భాగం) 2. బ్రాహ్మణాలు (పూజలు, యజ్ఞయాగాదులు మొ॥న కర్మకాండ) 3. ఆరణ్యకాలు (ఉపాసనలు) 4. ఉపనిషత్తు (పరమాత్మ తత్త్వం).

మానవులకు మోక్షమార్గాన్ని చూపేవే ఉపనిషత్తులు. ఇవి వేదాలకు అంతంలో ఉండటం వల్ల వేదాంతం అంటారు. మానవ జీవితాన్ని తరింప జేసుకొనుటకు, మోక్షాన్ని అందుకొనుటకు కావలసిన అద్భుత జ్ఞానాన్ని ప్రసాదించే ఉపనిషత్తులు నాలుగువేదాల లోను మొత్తం 1180 ఉన్నవి. అయితే 108 ఉపనిషత్తులు మాత్రమే మంత్రాలతో సహా ఇప్పుడు మనకు లభిస్తున్నాయి. ఇందులో కూడా 10 ఉపనిషత్తులు అత్యంత ముఖ్యమైనవని మహాత్ములందరూ అంగీకరిస్తున్నారు. అవే ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, తైత్తిరీయ, ఐతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యక అనే దశోపనిషత్తులు.

ఉపనిషత్తు అనే పదం మనచెవిన పడగానే ఒక సుందర మైన, ఆహ్లాదకరమైన, మనోహర దృశ్యం మన మనోఫలకంపై కదులుతుంది.

ప్రశాంతమైన ఒకవనవాటిక. పచ్చని చెట్లతో కళకళలాడుతున్న సుందర ప్రదేశం అది. అక్కడి చెట్లపై గల పక్షుల కిలకిల ధ్వానాలతోను, కోకిలల కుహూ కుహూ అనే కూజితాలతోను మనస్సుకు ఆహ్లాదం కలుగుతున్నది. బ్రహ్మచారుల వేద పఠనాలతో ఆ ప్రదేశమంతా పవిత్రతను సంతరించుకున్నది. ఆ ఆశ్రమ ప్రాంగణంలో ఒక చోట రావిచెట్టు, ఆ చెట్టు మొదలు వద్ద ఎత్తుగా ఉన్న అరుగు. ఆ అరుగుపై ఉచితాసనం.

దాని కెదురుగా సమీపంలో శుభ్రం చేసిన నేలపై దర్భాసనాలు వేసుకొని, సాధన చతుష్టయ సంపన్నులైన శిష్యులు వినయ విధేయతలతో గురుదేవుల అమృత వాక్కుల కొరకు ప్రశాంత మనస్కులై ఎదురుచూస్తున్నారు. సరియైన వేళకు శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు ఐన సద్గురువు తన ఆసనంపై ఆశీనులయ్యారు. శిష్యులు గౌరవ సూచకంగా లేచి నిలబడి అభివాదం చేసి తమతమ స్థానాలలో ఆశీనులయ్యారు. శాంతి మంత్రం పఠించి, గురువు శాస్త్రాన్ని తన అనుభవంతో జోడించి, అనర్గళంగా ప్రవచనం చేస్తుంటే, శిష్యులు సూక్ష్మ బుద్ధితో తత్త్వాన్ని అవగాహన చేసుకుంటున్నారు. ఇదీ ఉపనిషత్తు అనే పేరు చెవినబడగానే కనులముందు కదలాడే దృశ్యం.

ఈ దృశ్యం అంతా ఉపనిషత్తు అనే పదంలో అంతర్లీనంగా దాగి ఉన్నది. ఎందుకంటే

ఉప అంటే సమీపంగా,

ని అంటే క్రింద,

షత్ అంటే కూర్చొనుట.

కనుక ఉపనిషత్ అంటే సమీపంగా క్రింద కూర్చొనుట అని.

అంటే శిష్యులు వేదాంత జ్ఞానాన్ని బోధించే గురువుకు సమీపంగా క్రింద కూర్చొని, ఉపనిషత్తుల జ్ఞానాన్ని తెలుసుకోవాలి. అంతేగాని ఎవరింటిలో వారు కూర్చొని న్యూస్ పేపరు తిరగవేసినట్లు తిరగేసేది కాదు ఉపనిషత్తు. ఎందుకంటే ఇది ఆత్మవిద్య-బ్రహ్మవిద్య. ఈ విద్య మానవునిలోని అజ్ఞానాన్ని పోగొట్టి, సమస్త దుఃఖాలను నివృత్తిచేసి, పరబ్రహ్మాన్ని ఎరుకపరచి, ముక్తిని ప్రసాదిస్తుంది. కనుక దీనిని గురు సమ్ముఖంలో కూర్చొని, విని, మననం చేసి తెలుసుకోవలసినదే.

ఐతే సమీపంగా అంటే గురువు దేహానికి మరీ దగ్గరగా కూర్చోవాలని కాదు. గురువుయొక్క మనోభావాలను సరిగ్గా గ్రహిస్తూ, ఆయన మనస్సుతో నీ మనస్సును అనుసంధానం చేయాలి అని మాత్రమే. అలాగే క్రింద కూర్చొనుట అంటే శారీరకంగా, దేహ బాధలు ఎన్ని ఉన్నా క్రింద నేలమీద కూర్చోమని కాదు. తాను ఎంత తెలివిగలవాడైనా గురువు తనకన్నా ఎక్కువ తెలిసినవాడని, ఉన్నతుడని భావించి వినయవిధేయతలతో ఉండాలి. గంగ ఎప్పుడూ ఎత్తునుండి పల్లానికే ప్రవహిస్తుంది. ఈ జ్ఞానగంగ కూడా ఉన్నతులైన గురువుల నుండి అజ్ఞానంలో ఉన్న శిష్యులకు చేరాలి. అందుకే గురువుకన్నా తాను అధికుడనని భావించరాదు. అణకువ కలిగి ఉండాలి. ఇక కూర్చొనుట అనే పదం లోని అంతరార్థం శరీరం ఒకచోట కూర్చొనుట అని గాక మనస్సు అటూ ఇటూ పరుగులు తీయకుండా గురువాక్యాల యందే స్థిరంగా నిలిచి ఉండాలి అని.

ఉపనిషత్తులన్నీ వేదాలకు అంతంలో ఉన్నాయని, అందుకే వాటిని వేదాంతం అన్నారని, ఇంతకు ముందే చెప్పుకున్నాం. అయితే చాలా ఉపనిషత్తులు వేదాలకు అంతంలో ఉన్నప్పటికి కొన్ని మాత్రం వేదాలలోని మొదటి భాగమైన సంహితలోను, కొన్ని బ్రాహ్మణాలలోను, మరికొన్ని ఆరణ్యకాలలోను ఉన్నాయి.

మొట్టమొదటి ఉపనిషత్తు ఈశావాస్యోపనిషత్ శుక్లయజుర్వేదంలోని సంహితలో ఉండగా, రెండవదైన ఈకేనోపనిషత్ సామవేదంలోని బ్రాహ్మణాలలోనిది. తలవకార బ్రాహ్మణములోని 9వ అధ్యాయమే ఈకేనోపనిషత్తు. అందుకే దీనిని తలవకారోపనిషత్తు అని కూడా అంటారు. అయితే కేనోపనిషత్తు అన్నదే బహుళ ప్రచారంలో ఉన్నది. దీనికీ పేరు ఎలా వచ్చింది ?

''ఈశావాస్యమిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్'' అనే మొదటి మంత్రంలోని మొదటి వాక్యంలోని మొదటి పదాన్ని బట్టి మొదటి ఉపనిషత్తుకు ఈశావాస్యోపనిషత్తు అని పేరు వచ్చినట్లే ''కేనేషితం పతతి ప్రేషితం మనః'' అని మొదటి మంత్రంలోని మొదటి వాక్యంలోని మొదటి పదాన్ని బట్టి ఈ రెండవ ఉపనిషత్తుకు కేనోపనిషత్తు అనే పేరు వచ్చింది.

ఉపనిషత్తు అనే పదాన్ని చెవులారా వినటం కూడా పూర్వజన్మ సుకృత విశేషమే. అలాంటిది ఒక ఉపనిషత్తును మంత్రాలతోను, వాటి అర్థాలతోను, వివరంగా విపులంగా తెలుసుకోవటం గొప్ప అదృష్టం. ఇక ఉపనిషత్తును ఆమూలాగ్రంగా, కూలంకషంగా, అంతర్లీనంగా నిక్షిప్తమైయున్న సూక్ష్మ భావాలనుకూడా అవగాహన చేసుకోవటం ఇంకా ఇంకా అదృష్టం. ఇక ఈ జ్ఞానాన్ని సంపూర్ణంగా గ్రహించి, జీవితంలో ఆచరణ చేసి, అందుకనుగుణంగా జీవన విధానాన్ని మలుచుకోవటం అనేక జన్మల సుకృతం వల్లనూ, ఈ జన్మలోని ప్రయత్నం వల్లనూ మాత్రమే సాధ్యం. అట్టివారినే మహాత్ములుగా, మహాపురుషులుగా పరిగణించటం జరుగుతుంది. అలా సంపూర్ణంగా ఉపనిషత్తును అర్ధంచేసుకొని, ఆచరించుటకు వీలుగా ఎంతో వివరంగా, ఉపమానాలతో సహా, సులభమైన వాడుక భాషలో చెప్పటం జరిగింది ఈ గ్రంథంలో.

ఈ జ్ఞాన గంగలో మునిగి పునీతులమవుదాం. లభించిన ఈ మానవ జన్మను సార్థకం చేసుకుందాం.

శాంతి పాఠంతో ప్రారంభించి ఉపనిషత్తులోనికి ప్రవేశిద్దాం. ఈ అధ్యయనం ద్వారా మన జీవితాన్ని సార్థకం చేసుకొనేందుకు పరమాత్మ మనందరిపై తన అనుగ్రహవర్షాన్ని కురిపించాలని ఆశిస్తూ ఆశీర్వదిస్తూ

# దేవిశెట్టి చలపతిరావు
## వ్యాఖ్యాత.

# కేనోపనిషత్తు

### శాంతిపాఠము 1

ఓం సహనావవతు ! సహనౌభునక్తు ! సహవీర్యం కరవావహై!

తేజస్వినావధీతమస్తు ! మా విద్విషావహై ! ఓం శాంతిః శాంతిః శాంతిః॥

ప్రతిపదార్థం :- ఓం = పరమాత్మ; సహనౌ = మన ఇరువురిని; అవతు = రక్షించుగాక; సహనౌ= మన ఇరువురము; భునక్తు = ఆనందించెదముగాక; సహవీర్యం=ఇరువురము కలసి బాగా; కరవావహై = శ్రమించెదముగాక; నౌ=మన; అధీతం = అధ్యయనం; తేజస్వి అస్తు = ప్రకాశవంతమగుగాక; మా విద్విషావహై= పరస్పరము ద్వేషము లేకుండా ఉందుముగాక

భావం :- పరమాత్మ మన ఇరువురిని రక్షించుగాక! మన ఇరువురము ఆనందించెదము గాక! మనము ఇరువురము కలసి బాగా శ్రమించెదము గాక! మన అధ్యయనం ప్రకాశవంతమగుగాక! మన మిరువురము పరస్పరము ద్వేషము లేకుండా ఉందుముగాక.

ఆధిదైవిక, ఆధిభౌతిక, ఆధ్యాత్మిక తాపములు శాంతించుగాక!

వ్యాఖ్య :- ఉపనిషత్తును అధ్యయనం చేయుటకు కూర్చోగానే ముందుగా గురుశిష్యులిరువురూ కలిసి శాంతి పాఠాన్ని పఠించటం శిష్టాచార సాంప్రదాయం. చేసే అధ్యయనం ఎటువంటి ఆటంకాలు లేకుండా, శాస్త్రహృదయం బాగా

అవగాహన అయ్యేటట్లుగ, కొనసాగాలనే భావనతో భగవంతుని మనస్ఫూర్తిగా ప్రార్థించుటే ఈ శాంతి పాఠాన్ని చదవటంలో గల ఉద్దేశం.

సూర్యోదయానికి ముందే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకొని, స్నానాదికాలు పూర్తిగావించి, జపధ్యానాదులను పూర్తిచేసి, ఉపనిషత్తును శ్రవణం చేయటానికి ఆశ్రమప్రాంగణంలోని గురుపీఠం వద్ద ఆశీనులవుతారు శిష్యులు. ఉపనిషత్తును వినిపించటానికి శ్రోత్రియుడు, బ్రహ్మ నిష్ఠుడు ఐన గురువు తన స్థానంలో ఆశీనుడవుతాడు. అప్పుడు ఇరువురుకలిసి శాంతి పాఠాన్ని చదువుతారు. ఆ విధంగా ఉపనిషత్తు అధ్యయనాన్ని ప్రారంభించటం సాంప్రదాయం.

ఓం సహనావవతు : - ఓం అంటే ప్రపంచానికి జీవుడికి ఆధారమైన నిరాకార నిర్గుణ సర్వవ్యాపక పరమాత్మ. సహనౌ అవతు అంటే అందరి హృదయాలలోను ఉన్న పరమాత్మ మా ఇరువురినీ రక్షించుగాక ! అని. దేని నుండి రక్షించాలి ? శాస్త్రాన్ని తెలుసుకోవటంలో-లక్ష్యార్థాన్ని గ్రహించటంలో వచ్చే ఆటంకాలనుండి రక్షించాలి. సాధకుడైనవాడు జీవభావంలో ఉండి తాను వేరు, పరమాత్మ వేరు అనే భావనలో (భ్రమలో) ఉంటాడు. ఆ భ్రమను పోగొట్టుకొనుటకు అట్టివాడు పరమాత్మ తత్వాన్ని తెలుసుకొని-ఉన్నది పరమాత్మ ఒక్కటేనని, నేను ఆ పరమాత్మనేనని గ్రహించాలి. అలాగ్రహించాలంటే పరమాత్మ తత్వాన్ని తెలియజెప్పే ఉపనిషత్తులను, శాస్త్రాలను ముందుగా సూక్ష్మ బుద్ధితో గ్రహించాలి. బుద్ధిసూక్ష్మంగా ఉండాలంటే మనస్సు ప్రశాంతంగా ఉండాలి. మనస్సు ప్రశాంతంగా ఉండాలంటే ప్రాపంచిక విషయాలగురించిన ఆలోచనలు గాని, భూతకాలపు జ్ఞాపకాలు గాని, భవిష్యత్తుకు సంబంధించిన భయాలు గాని, వర్తమానపు అవసరాల గురించిన ఆలోచనలుగాని

లేకుండా- రాకుండా ఉంటేనే సాధ్యం. అలా అన్నింటినుండి రక్షణపొందాలనే తపనతో భగవంతుని ఇలా ప్రార్థించాలి. అప్పుడే మనస్సు ప్రశాంతమై, బుద్ధి సూక్ష్మమై, గురువు చెప్పే జ్ఞానం సూటిగా అందుతుంది. శాస్త్రపు లోతులు పూర్తిగ తెలుస్తాయి. ఇలా శాస్త్రపు లోతులను గ్రహించటంలో వచ్చే ఆటంకాల నుండి రక్షించమని కోరటమే ఈ సహనావవతు యొక్క భావం.

సహనౌభునక్తు :- మేము ఇరువురము ఆనందించెదము గాక ! దేనికి ఆనందం? శాస్త్రాన్ని అధ్యయనం చేస్తుంటే, శాస్త్రం యొక్క లోతులను తెలుసుకుంటుంటే పరమాత్మ ఎక్కడో మనకన్న వేరుగా దూరంగా లేడని, ఆయన మనలోనే ఉన్నాడని, అసలు మనమే ఆయన అని మనం నిజంగా పరమాత్మ స్వరూపులమేనని తెలుస్తుంది. ఇలా తెలుస్తున్నకొద్దీ, పరమాత్మకు సన్నిహిత మవుతున్న కొద్దీ, పరమాత్మ తత్త్వమైన ఆనందాన్ని అనుభవిస్తుంటాం. ఇలా పరమాత్మతో తాదాత్మ్యం చెంది ఆనందించాలని ప్రార్థన.

సహవీర్యం కరవావహై :- ఇరువురము కలిసి శ్రమించెదము గాక ! ఆధ్యాత్మిక మార్గం చాలా కష్టసాధ్యమైన మార్గం, సోమరి పోతులకు ఏ మాత్రం ఈ రంగంలో అవకాశం లేదు. ప్రతిరోజూ సూర్యోదయానికి ముందే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకొని, స్నానాదులు కావించి, జపధ్యానాలు పూర్తిగావించి, శాస్త్రశ్రవణానికి సిద్ధంకావాలి. ఉదయం 8 గంటల వరకో 9 గంటలవరకో దుప్పటి ముసుగు తీయనివానికి ఈ రంగంలో స్థానం లేదు. కేవలం శాస్త్రాన్ని శ్రవణంచేస్తే చాలదు. విన్న దానిని చక్కగా మననం చేయాలి. సందేహాలను గురువు ద్వారా తీర్చుకోవాలి. గురువు చెప్పిన విధంగా సాధనలు సాగించాలి. ఇవన్నీ చెయ్యాలంటే బాగా

శ్రమించాల్సిందే. అందుకే మేము బాగా శ్రమించెదముగాక ! అని ప్రతిజ్ఞాపూర్వకంగా ప్రమాణం తీసుకుంటున్నాం. అలా తీసుకోవాలి.

తేజస్వినావధీతమస్తు :- నౌ = మాయొక్క, అధీతం = అర్థం చేసుకొనేశక్తి, తేజస్వి అస్తు = తేజోవంతము అగుగాక !

గరుకు రాతి మీద రుద్దిన కొద్దీ కత్తికి, కొడవలికి పదును పెరుగుతుంది. అలాగే బుద్ధి పదునెక్కాలంటే జ్ఞానంతో బాగా రాపాడించాలి. అలా రాపాడించగా పదునెక్కిన బుద్ధితో శాస్త్రాన్ని అవగాహన చేసుకోవాలి. శాస్త్రాన్ని వింటూ వింటూనే అర్థం చేసుకోగలిగేటట్లు బుద్ధి తేజస్సుతో సూక్ష్మంగా ఉండాలి. అందుకే ఈ ప్రార్థన. తనలో ఇంతకు ముందే ఉన్న తప్పుడు భావాలతోకలుషితం కాకుండా గురువు చెప్పే విషయాలు, శాస్త్ర హృదయం తన అంతర్యంలో నిలిచేటట్లు చేయమని ఇక్కడి వేడికోలు.

మావిద్విషావహై: - మా ఇరువురి మధ్య ద్వేషము లేకుండుగాక ! ఇదొక విచిత్రమైన భావం. అసలు గురు శిష్యుల మధ్య ద్వేషం ఎందుకు కలుగుతుంది ? గురువు జ్ఞానసంపన్నుడు. కాని శిష్యుడు పరిమిత జ్ఞానం కలవాడు. ఇంతవరకు తాను ప్రవర్తిస్తున్న తీరుగాని, ఇంతవరకు తనకున్న భావాలు గాని తప్పని తెలిసినప్పుడు గురువును అపార్థంచేసుకోవచ్చు. గురువు చెప్పే విషయాలు ఒకరకంగాను, గురువు యొక్క ప్రవర్తన మరియొక రకంగాను ఉండి, గురువును అర్థం చేసుకోలేక పోవచ్చు. ఇలాంటి సందర్భాలలో గురువుపై ద్వేషం కలగవచ్చు. అలా ద్వేషం కలిగితే గురువుపై విశ్వాసం సడలిపోవచ్చు. అందువల్ల శాస్త్రం యొక్క హృదయాన్ని అర్థంచేసుకోవటం అసాధ్యం అవుతుంది. భగవత్స్వరూపుడైన గురువును అపార్థం చేసుకొని, ద్వేషం

పెంచుకొని శిష్యుడు అధఃపతనం చెందుతాడు. ఇది నివారించటానికే ఈ ప్రార్ధన. అలాగే తెలియక అజ్ఞానంతో శిష్యుడు ద్వేషించినా, గురువు చెప్పినట్లు వినకపోయినా గురువులో మాత్రం ద్వేషబుద్ధి కలగరాదు. అందుకే గురువుకూడా శిష్యునితో శ్రుతికలుపుతున్నాడు.

ఆధిదైవిక - ఆధిభౌతిక - ఆధ్యాత్మిక - విఘ్న ములు కలగకుండా రక్షించమని 3మార్లు శాంతిః శాంతిః శాంతిః

## శాంతి పాఠం 2.

ఓం ఆప్యాయంతు మమాంగాని వాక్ ప్రాణః చక్షుః శ్రోత్రం అథోబల మింద్రియాణిచ సర్వాణి, సర్వం బ్రహ్మోపనిషదం, మాహం బ్రహ్మనిరాకుర్యాం, మా మా బ్రహ్మనిరాకరోత్, అనిరాకరణమస్తు అనిరాకరణం మేస్తు, తదాత్మని నిరతే, య ఉపనిషత్సుధర్మాః తేమయిసంతు తేమయిసంతు॥

ఓం శాంతిః శాంతిః శాంతిః॥

ప్రతిపదార్థం :- ఓం = పరమాత్మ; మమ అంగాని=నా అవయవములు; వాక్=వాక్కు; ప్రాణః=ప్రాణము, చక్షుః=కన్ను; శ్రోత్రం=చెవి, అథ=ఇక; బలం=బలము; సర్వాణి ఇంద్రియాణి=అన్ని ఇంద్రియాలు; ఆప్యాయంతు=వృద్ధిచెందునుగాక; సర్వం=ఇది అంతయు; ఔపనిషదంబ్రహ్మ=ఉపనిషత్తులకు చెందినబ్రహ్మమే; అహం=నేను; బ్రహ్మ= పరమాత్మను; మా నిరాకుర్యాం=నిరాకరించకుందునుగాక; మా=నన్ను; బ్రహ్మ= పరమాత్మ; మానిరాకరోత్=నిరాకరించకుండునుగాక; అనిరాకరణంఅస్తు=నాలో నిరాకరణం లేకుండుగాక; మే=నాకు; అనిరాకరణం అస్తు=నిరాకరణం లేకుండుగాక;

మావద్ద లభించే అన్ని పుస్తకముల వివరముల కొరకు ఈ క్రింది లింక్(URL) పై క్లిక్ చేయండి :

http://www.srichalapathirao.com/catalog

"కేనోపనిషత్తు (కేన ఉపనిషత్తు)"గ్రంథంపై పూజ్య గురుదేవులు "శ్రీ దేవిశెట్టి చలపతిరావుగారు" చేసిన వ్యాఖ్య 100 పేజీలకు పైగా ఉన్న పుస్తకములు మా వద్ద లభించును

Ebooks మీరు DOWNLOAD చేసుకొనుటకు రూ.100/- లేదా పుస్తకమును మేము మీ ఇంటికి పంపాలంటే (courier ఖర్చులు అదనం కలిపి) ONLINE లో చెల్లించుటకు -

Click & Pay us through Paytm :

http://srichalapathirao.com/images/paytm_QR_WWWSRICHALAPATHIRAOCOM.png

లేదా

Pay us through Net Banking :

http://srichalapathirao.com/PDFs/Bank.pdf

మీకు మరేదైనా సందేహం ఉంటే care@srichalapathirao.com కు ఈమెయిల్ పంపగలరు లేదా +91 80085 39770 OR +91 95388 58115 నంబర్లకు ఫోన్ చేయగలరు

అన్ని పుస్తకములను లేదా కొన్ని పుస్తకములను లేదా గురుముఖతా ప్రవచనములను (వీడియో ప్రవచనముల కొరకు) శ్రవణం చేయుటకు DVD, External Hard Disk లేదా Audio CD, Pen Drive కొరకు ఈ క్రింది లింక్(URL) పై క్లిక్ చేయండి :

http://www.srichalapathirao.com/catalog

WWW.SRICHALAPATHIRAO.COM